

కంటైనర్‌లో మంటలు
తడ పోలీస్ స్టేషన్ ఎదుట కంటైనర్‌లో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. - 10లో



రాత్రి పూట కౌన్సెలింగ్
ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ రాత్రిపూట నిర్వహించారు. - 10లో



దొంగలు అరెస్టు
దొరవారిసత్రం, ఓజిలి మండలాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. - 10లో

న్యూస్‌రీల్

పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు తీసుకురావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : పోలీసు వ్యవస్థకు చెడ్డ పేరు తీసుకురావొద్దని, ఎవరైనా పోలీసులు తప్పు చేయాలంటే వారి వెనకాల కుటుంబం ఉందని గుర్తు చేసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఏఆర్ పోలీసు సిబ్బందితో పరేడ్ నిర్వహించారు. పోలీసులలో ఏ ఒక్క పోలీసు తప్పు చేసిన దాని ప్రభావం పోలీసులందరి మీద పడుతుందన్నారు. ఏదైన సమస్య ఉంటే నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా తప్పు చేస్తే... చర్యలు మాత్రం చాలా సీరియస్‌గా ఉంటాయన్నారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తుంటే పోలీసు ఉద్యోగం వదలిపెట్టాలన్నారు. పోలీసు ఉద్యోగంలో ఉండి తప్పు చేస్తే.. మాత్రం ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

9న షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని మహతీ ఆడిటోరియంలో ఈనెల 9వ తేదీన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం కలెక్టర్, ఇన్‌చార్జ్ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి రూ.20 వేలు నగదు, ప్రశంసా పత్రం, పతకం అందించనున్నట్లు డీఈఓ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,284 మంది స్వామి వారిని దర్శించుకోగా 31,268 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

25 నుంచి డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో 2022-23 బ్యాచ్ డిగ్రీ 5వ సెమిస్టర్ రెగ్యులర్‌గా చదవి పరీక్షలలో తప్పిన విద్యార్థులకు ఈనెల 25వ తేదీ నుంచి ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 16వ తేదీలోపు పరీక్ష ఫీజును చెల్లించాలన్నారు. రూ.1500 అపరాధ రుసుముతో 18 వరకు, రూ.3500 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీలోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

– రేపు ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: యూపీఎస్సీకి చెందిన ఇ-ఇంజినీరింగ్ సర్వీసెస్ (ప్రిలిమినరీ)పరీక్షకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో 791 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. పేపర్-1 పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షకు అభ్యర్థులు గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని సూచించారు. తిరుపతిలోని రెండు పరీక్షా కేంద్రాలైన తిరుచానూరు రోడ్డు లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని ఎస్‌డీఎస్ ఆర్ట్స్ కళాశాల, బాలాజీ కాలనీ, వెస్ట్ చర్చిరోడ్డు మార్గంలోని శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూపీఎస్సీ అబ్జర్వర్ న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన కిరణ్ కర్లా అరోరాతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి సర్వేలు!



గ్రౌండ్ రిపోర్ట్

నాడు సంక్షేమం

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన విషయం తెలిసిందే. సచివాలయ సిబ్బంది ద్వారా అర్హత కలిగిన ప్రతి ఇంటి గడపను తాకింది.

నేడు మోసం

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సంక్షేమం పూర్తిగా అటకెక్కింది. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునే వ్యూహంలో భాగంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తూనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు గొంతు సవరించారు.

ఎన్నికల సమయంలో సూపర్ -6 హామీలంటూ చంద్రబాబు అలవికాని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తరువాత సర్వేల మీద సర్వేలు చేస్తూ ఏడాదిగా కూటమి ప్రభుత్వం కాలయాపన చేసింది. ఇప్పటి వరకు ప్రజలకు ఏ ఒక్క పథకం అందకపోవడంతో చేసిన సర్వేలన్నీ ఉత్తుత్తివేనా అని జనం నిట్టూరుస్తున్నారు. సర్వేలో వ్యక్తిగత సమాచారం తీసుకున్న ఉద్యోగులు వాటిని ఎందుకు తీసుకున్నారో ప్రజలకు చెప్పలేకపోతున్నారు. ఈ సమాచారం గోప్యతపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో సర్వేలు చేశారే గాని.. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఎగ్గొట్టారు. ఈ సర్వేల తతంగంపై జిల్లాలోని ప్రజల ఆగ్రహంపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్.

కూటమి ఏడాది పాలనలో సర్వేలతో కాలయాపన

- సర్వేలు ఎందుకని అడిగితే సంక్షేమ పథకాల కోసమంటూ సమాధానం
- సర్వేలు చేశారే తప్ప పథకాలు అమలు చేయని వైనం
- సేకరించిన వ్యక్తిగత సమాచారానికి గోప్యత కరువు ?

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికి లబ్ధి కలిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి హామీలు గుప్పించింది. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం ఆ హామీలు నెరవేర్చాల్సి ఉంటుంది. అయితే ఆ హామీలను అమలు చేయకుండా సర్వేలతోనే ఏడాదిగా కాలయాపన చేసింది. సర్వేలతో ప్రజలకేమైనా లాభం చేకూరిందా అంటే అదీ లేదు.

ఇంటింటికి తిరిగి సర్వేలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిగా సర్వేల పైనే ఎక్కువ మక్కువ చూపించింది. సచివాలయ ఉద్యోగులను పలు మార్లు ఇంటింటికి తిప్పి ప్రజల వ్యక్తిగత సమాచారాలను సేకరించారు. ఆ సమాచారాలు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తే సంక్షేమ పథకాల అమలు కోసమని మాయ మాటలు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో సచివాలయ సిబ్బంది నెలల తరబడి ఇంటింటికీ తిరిగి ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరించారు. హౌస్ హోల్డ్ సర్వే పేరుతో వివరాలు సేకరించారు. మన మిత్ర క్యాంపెయిన్ పేరుతో సర్వేలు చేపట్టారు. నాన్ రెసిడెంట్ పేరుతో సమాచారాన్ని సేకరించారు. అదర్ డిపార్ట్‌మెంట్ ఈకేవైసీ సొసైటీ బ్యాంక్ ఓటర్ల పేరుతో సర్వే చేపట్టారు. ఇవే కాకుండా పలు రకాల సర్వేలు చేపట్టి ప్రజలను గందరగోళానికి గురిచేశారు.

విచారణ పేరుతో పింఛన్ల కోత

పింఛన్ రూ.1000 పెంచామని గొప్పలు చెప్పకుంటున్న ప్రభుత్వం విచారణ పేరుతో వేలాది పెన్షన్లను తొలగించే చర్యలు ఇప్పటికే చేపట్టిన విషయం తెలిసిందే. రెండు నెలల క్రితం పీ4 సర్వే చేపట్టడం ఇందులో భాగమనే సందేహాలు ప్రజానీకంలో వ్యక్తమవుతున్నాయి. సంపాదన పరుల జాబితాలో వ్యవసాయ కూలీలు, ఫింఛనర్ల పేర్లు చోటుచేసుకున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సర్వేపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వే గుట్టు బాబుకే ఎరుకని పరిశీలకులు వివరిస్తున్నారు.

వ్యక్తిగత సమాచారం గోప్యత ఉందా?

వివిధ రకాల సర్వేల పేరుతో కూటమి ప్రభుత్వం సేకరించిన ప్రజల వ్యక్తిగత వివరాలకు గోప్యత లేని దుస్థితి. ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో కోత విధించేందుకు వివిధ సర్వేలు చేపట్టిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. కూటమి చేపట్టిన వివిధ సర్వేల్లో సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వ కార్యక్రమాలకే వాడుతున్నారా? ఇంకేమైనా కుట్రలు చేస్తున్నారా అనే సందేహం ప్రజల్లో తలెత్తుతోంది.

గత ఐదేళ్లల్లో సర్వేలు లేకుండా సంక్షేమ పథకాలు

గత ఐదు సంవత్సరాల వైఎస్సార్‌సీపీ సర్కారు ఎలాంటి సర్వేలు నిర్వహించకుండానే సంక్షేమ పథకాలను అమలు చేసింది. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా సంక్షేమ పాలనను అందించింది. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నవరత్నాల హామీల మేనిఫెస్టో ప్రకారం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు సర్వేల పేరుతో చేస్తున్న కుట్రలను ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

తిరుపతి జిల్లా సమాచారం

జిల్లాలోని మండలాలు	33
మొత్తం జనాభా	21.97 లక్షలు
పురుష జనాభా	10.99 లక్షలు
మహిళల జనాభా	10.98 లక్షలు
రూరల్ జనాభా	13.47 లక్షలు
అర్బన్ జనాభా	8.50 లక్షలు
మొత్తం కుటుంబాలు	5.72 లక్షలు
ఎస్సీ జనాభా	5.19 లక్షలు
ఎస్టీ జనాభా	1.71 లక్షలు

పీ 4 సర్వేతో అన్ని వర్గాల్లో ఆందోళన



తిరుపతిలో సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి చేపడుతున్న సర్వే (ఫైల్)

కూటమి ప్రభుత్వం పీ4 పేరుతో సర్వే నిర్వహించింది. ఈ సర్వేపై జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమయ్యింది. సంక్షేమ పథకాల ఎత్తివేతకే ఈ సర్వే చేస్తున్నారనే అనుమానం బలపడింది. ఇప్పటికే ఎన్నికల ముందు ఎడతెరిపి లేని హామీలిచ్చిన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకపోగా ఏదో ఒక నెపంతో సీరుగార్చే యత్నాలు చేపట్టిన విషయం ఇప్పటికే ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. గుట్టుచప్పుడు కాకుండా జిల్లాలో పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టిసిపేషన్స్ (పీపీపీ) పేరిట సర్వే చేపట్టారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, దాతల సహకారంతో గుర్తించిన నిరుపేదల జీవన పరిస్థితులు మెరుగుపరచడమే సర్వే ప్రధాన ఉద్దేశమని అధికారులు అంటున్నారు. అయితే ఈ సర్వే ఎన్నో సందేహాలు ప్రజల్లో తలెత్తాయి. సర్వేలో కుటుంబ సభ్యుల పేరిట వ్యవసాయ భూమి ఎంత ఉంది? మున్సిపల్ ప్రాంతాల్లో ఎన్ని సొంత గృహాలు ఉన్నాయి? నాలుగు చక్రాల వాహనాలు ఏమైనా ఉన్నాయా? కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారా? ఇన్‌కం ట్యాక్స్ ఏమైనా చెల్లిస్తున్నారా? నెలకు విద్యుత్ వినియోగం ఎంత ? అనే అంశాలపై సచివాలయ సిబ్బంది ఆరా తీసి వివరాలు సేకరించి నమోదు చేశారు. సర్వే సిబ్బంది సేకరిస్తున్న వివరాల్లో ఎక్కువ భాగం ఆదాయానికి సంబంధించిన ప్రశ్నలే ఉండడం పలు సందేహాలకు తావిస్తోంది.

వివరాల గోప్యతపై అనుమానం



సచివాలయం సిబ్బంది పలుమార్లు ఇంటికి వచ్చి ఆధార్, రేషన్‌కార్డు వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలు గోప్యంగా ఉన్నాయా లేవా అనే ఆందోళన ఉంది. అందించిన సేవల కన్నా చేసిన సర్వేలు ఎక్కువగా ఉన్నాయి. సర్వేల్లో వ్యక్తిగత వివరాలతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని భయంగా ఉంది. – వై.భాగ్యమ్మ, కొత్త ఒడ్డిపల్లి, పాకాల మండలం

ఆశ చూపి మోసం చేశారు



ఎన్నికల్లో వివిధ రకాల హామీలను ఆశ చూపి మోసం చేశారు. ఏడాది గడిచినా హామీల్లో అమలు చేయకపోయినా ప్రతి ఇంటా ప్రతి రోజు 17 రకాల సర్వేల పేరుతో సర్వేలు చేస్తున్నారు. సర్వేల ద్వారా ఏమైనా పథకాలు వస్తాయిలే అనే ఆశతో ఉన్నారు. నేటికి ఎలాంటి ప్రయోజనం కానరాలేదు. – శ్రీనివాసులురాజు, సైదాపురం మండలం

సర్వేల ఆంతర్యం ఏమిటో



కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలోనే సచివాలయ ఉద్యోగుల నేతృత్వంలో 17కి పైగానే సర్వేలు చేపట్టారు. సర్వే చేసిన సందర్భంగా సర్కార్ సంక్షేమ పథకాలు అమలు చేస్తారని ఆశ పడ్డాం. అయితే మొదటి ఏడాది కాలం పథకాలు ఇవ్వలేదు. పథకాలు ఇవ్వకపోవడంతో తొలగిస్తారనే ఆందోళన తప్పడం లేదు. – సుదర్శన్, తిరుపతి

పథకాలు అమలేదీ



సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు ఎక్కడా.... ఎప్పుడు ఇస్తారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చి 12 నెలలు పూర్తి అయింది. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో కూర్చున్న తర్వాత పథకాలకు డబ్బులు లేదని మాట్లాడుతున్నారు. పథకాలు ఇవ్వనప్పుడు సర్వేలు ఎందుకు చేయించారో ప్రజలకు చెప్పాలి. – యశోద, తిరుపతి

ఎందుకు చేస్తున్నారో తెలియదు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పలుసార్లు ఇళ్ల వద్దకు సచివాలయం సిబ్బంది వచ్చి సర్వేల పేరుతో ఆధార్ నమోదు, వేలి ముద్రలు సేకరించారు. సర్వేలపై ప్రశ్నిస్తే ఒక్కోసారి ఒక్కో రకమైన సమాధానాలు ఇచ్చారు. పలుసార్లు సర్వే పేరుతో వ్యక్తిగత సమాచారం సేకరించడం ఏమిటో అర్థం కావడం లేదు.– ఒత్తూరు మునిక్రిష్ణ, మెట్టు, చిట్టమూరు మండలం

పోలీసులకే రక్షణ లేదు!

- బిహార్‌ను తలపిస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల అరాచకాలు
- కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోండి
- విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి డిమాండ్



బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : మనం ప్రజాసామ్య దేశంలోనే ఉన్నామా..? నియంత పాలనలో బతుకుతున్నామా..? అని అనుమానం కలుగుతోందని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుదీర్‌రెడ్డి డ్రైవర్.. పోలీస్ కానిస్టేబుల్ అన్వర్ బాషాపై దాడి చేయించిన ఘటనపై ఆయన మాట్లాడారు. అధికార పార్టీలో ఉండి విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను బలవంతంగా పిలిపించి కొట్టడమేమిటని ఆయన ప్రశ్నించారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ దగ్గరుండి కానిస్టేబుల్‌ను తీసుకెళ్లి ఎమ్మెల్యే ముందు నిలబెట్టి కొట్టించడం చూస్తుంటే రక్షణ వ్యవస్థ ఎలా దిగజారిందనేది ప్రజలు గమనిస్తున్నారన్నారు.

డీఎస్పీ సమాధానం చెప్పాలి

బాధ్యతాయుతమైన డీఎస్పీ స్థానంలో ఉన్న అధికారి అలాంటి ఘటనలేవీ జరగలేదని బుకాయించడం.. కాసేపటికే ఎస్పీ కార్యాలయం నుంచి ఘటన జరిగింది వాస్తవమే కానీ క్షమాపణ చెప్పించలేదు... అని అధికారిక ప్రకటన ఇవ్వడంపై డీఎస్పీ సమాధానం చెప్పాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కానిస్టేబుల్ కొడుకునని చెప్పుకుంటారు కదా.. మరి ఈరోజు శ్రీకాళహస్తిలో ఓ కానిస్టేబుల్ పై దాడి జరిగింది. దీనిపై కానిస్టేబుల్‌కు ఏ విధమైన న్యాయం చేస్తారో ప్రజలకు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల పైన గత నెలలో దాడి చేశారనీ, ఈరోజు పోలీసులపైన దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై న్యాయ విచారణ చేపట్టి పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీఐపై చర్యలు తీసుకొని కానిస్టేబుల్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలని కోరారు. శ్రీకాళహస్తిలో ఏడాది కాలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై 270 అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఎమర్జెన్సీ రోజులను కూటమి పాలన గుర్తుకు తెస్తోందని ఆయన విచారం వ్యక్తం చేశారు.

ఉజ్వల భవితకు ఐఐటీ



తిరుపతి ఐఐటీ క్యాంపస్

ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎస్ సత్యనారాయణ

- నేడు తిరుపతి ఐఐటీలో ఓపెన్ హౌస్ సెషన్

ఏర్పేడు: జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 అర్హత సాధించిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులకు తిరుపతి ఐఐటీ శనివారం ఓపెన్‌హౌస్ పేరిట ఆహ్వానించినట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఏర్పేడు సమీపంలో ఉన్న తిరుపతి ఐఐటీలో చేపడుతున్న విద్యా కార్యక్రమాలు, క్యాంపస్‌లో ఉన్న అధునాతన సౌకర్యాలు, అందుబాటులో ఉన్న కోర్సులు, అండర్ గ్రాడ్యుయేట్ కరికులం, డ్యూయల్ డిగ్రీ వెసులుబాటు, హాస్టల్ సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణ సౌకర్యాలు, విద్యార్థులు తమ మేథస్సుతో నూతన ఆవిష్కరణ వైపు తీర్చిదిద్దేందుకు ఐఐటీలో ఉన్న అవకాశాలను గురించి ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. అలాగే కార్యక్రమ అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో క్యాంపస్ టూర్ ఏర్పాటు చేసి ఐఐటీలో ఉన్న అధునాతన సౌకర్యాలు, బోధనాభ్యసన విధానాలపై ప్రత్యక్ష అనుభవం కల్పించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సెషన్‌కు విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి స్వయంగా పాల్గొనవచ్చని, ఇక్కడకు వచ్చేందుకు వీలు కాని వారు ఆన్‌లైన్‌లోనూ హాజరు కావచ్చన్నారు. తిరుపతి ఐఐటీ అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచి ఉన్నట్లు , ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకుని ఓపెన్‌హౌస్ సెషన్‌లో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష



అన్నమాచార్య కళాశాలలో పరీక్షలు రాస్తున్న వారిని పరిశీలిస్తున్న కలెక్టర్, డీఈవో



శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షకు వెళుతున్న అభ్యర్థులు

- తొలిరోజు 126 మంది గైర్హాజరు

తిరుపతి అర్బన్ : డీఎస్సీ పరీక్షలకు తొలి రోజే 126 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 8 కేంద్రాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం 4 కేంద్రాల్లో మాత్రమే ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్షలు చేపట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు డీఈవో కేవీఎన్ కుమార్ కరకంబాడీ రోడ్డులోని అన్నమాచార్య ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఉదయం జరిగిన సెషన్స్‌కు 573 మందికి 509 మంది మాత్రమే హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌కు 570 అభ్యర్థులకు 508 మంది హాజరయ్యారు. తొలి రోజు తిరుపతిలోని అన్నమాచార్య కళాశాల , పుత్తూరులోని శ్రీవెంకటేశ్ పెరుమాళ్ కళాశాల, గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో మాత్రమే రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈనెల 30 వరకు డీఎస్సీ పరీక్షలకు సంబంధించి 33,607 మంది అభ్యర్థులు సెషన్స్‌ల వారీగా పరీక్షలు రాయాల్సి ఉంది.



తనిఖీ చేస్తున్న సిబ్బంది

‘పది’ పరీక్షల నిర్వహణలో విఫలం



డీఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి రూరల్ : పదో తరగతి పరీక్షల నిర్వహణలో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి చేరుకున్న ఆయన ఓ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల తీరని నష్టం జరిగిందన్నారు. రాష్ట్రంలో 6.14 లక్షల మంది విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించలేకపోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం తన తప్పిదాన్ని అంగీకరించి ఎలాంటి ఫీజు లేకుండా రీవాల్యుయేషన్ చేయించాలన్నారు. జవాబు పత్రాలు దిద్దడంలో చోటు చేసుకున్న తప్పులకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, వైవీపాళెం పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, చంద్రగిరి నియోజక వర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, కుప్పం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్, విద్యార్థి విభాగం నుంచి వచ్చిన వివిధ మండలాల అధ్యక్షులు హరి, వినోద్, యశ్వంత్, రఫి, ఓంప్రకాష్‌రెడ్డి, రాజారెడ్డి, చరణ్‌రెడ్డి, జగన్ రెడ్డి ఉన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.1,00,270
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.9,087
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,08,400
రిటైల్ వెండి గ్రాము రూ.111.50

క్లుప్తంగా

దొంగలు అరెస్టు

దొరవారిసత్రం : దొరవారిసత్రం, ఓజిలి ప్రాంతంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు తెలిపారు. శుక్రవారం చోరీపై విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన ప్రసన్నకుమార్, ప్రశాంత్, కిషోర్.. డీవీ సత్రం, ఓజిలి ప్రాంతంలోని వివిధ గ్రామాల్లోని గుడులు, ఇళ్లలో పలు చోరీలకు పాల్పడ్డారు. నిందితులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి శుక్రవారం ప్రసన్నకుమార్, ప్రశాంత్‌ను అరెస్ట్ చేయగా మరో నిందితుడు కిషోర్ పరారీలో ఉన్నాడన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బంగారం విలువ సుమారు రూ.2.20 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను శనివారం సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

20 వేపచెట్ల నరికివేతపై కేసు

నాయుడుపేటటౌన్ : మేనకూరు గ్రామ పంచాయతీలో 20కి పైగా వేప చెట్లను ఇద్దరు వ్యక్తులు అక్రమంగా నరికారని పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మేనకూరులోని హిందూ శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన పంచాయతీకి సంబంధించిన చెట్లను నరికేసి తరలించుకుని పోయారని కార్యదర్శి అశోక్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి తప్ప.. అవినీతి లేదు!

- తుడా చైర్మన్‌కు ఎలాంటి ఎగ్జిక్యూటివ్ పవర్ ఉండదు
- నిష్పక్షపాత విచారణ జరిగితే.. మాకష్టం ప్రజలకు తెలుస్తుంది
- మీడియాతో తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో అభివృద్ధి పనులు చేయడం తప్ప.. అవినీతికి ఆస్కారం లేదని, అక్కడ చైర్మన్‌కు ఎలాంటి కార్యనిర్వాహణ అధికారాలు ఉండవని తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. తుడాలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా తుడా అథారిటీనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఏదేదో అసత్య ప్రచారాలను పత్రికల్లో రాస్తే వారిపై పరువునష్టం దావా వేయడానికి వెనుకాడనని తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని ఆయన ఇంటి వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెవిరెడ్డి మాట్లాడుతూ.. ఒక చిన్న కార్యాలయంలా ఉన్న తుడా ఆఫీసును ఒక కార్పొరేట్ కార్యాలయం మాదిరిగా రూపుదిద్దామన్నారు. తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలో రెండు మండలాలకు పరిమితమైన తుడాను 9 నియోజక వర్గాలకు విస్తరింపజేయడం జరిగిందన్నారు. తుడా చైర్మన్‌కు టీటీడీ పాలక మండలిలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా జగనన్న ప్రభుత్వంలో తీసుకొచ్చామన్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ కింద ఉన్న శ్రీసిటీని జగనన్న సహకారంతో తుడా పరిధిలోకి తీసుకొచ్చామని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఏళ్ల తరబడి ఒకే హోదాలో పనిచేస్తున్న వారికి పదోన్నతులు ఇప్పించడం జరిగిందన్నారు.

తుడా ఆదాయం రెట్టింపు

2019లో తుడా చైర్మన్‌గా తాను బాధ్యత తీసుకునే సమయానికి రూ.26 కోట్ల బడ్జెట్ ఉండేదన్నారు. ఆ తరువాత వందల కోట్లు ఆదాయంగా తీసుకొచ్చి మొదటి ఏడాదికి రూ.15 కోట్లకు పైగా ఉద్యోగుల భవిష్యత్తు కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ వేయడం జరిగిందన్నారు. ఏళ్లుగా సూరప్పకశం వద్ద 145 ఎకరాలు ఆక్రమణ భూమిని తుడాకు తీసుకొచ్చి అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలకు విక్రయించి తుడాకు ఆదాయాన్ని తెచ్చిపెట్టామని చెవిరెడ్డి వివరించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద తుడా టవర్స్‌ను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి విడిపించి తుడాకు అప్పగించడం వల్లనే తుడా టవర్స్ వచ్చాయన్న వాస్తవం గుర్తించాలన్నారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కొందరు 15 ఎకరాల స్థలం ఆక్రమిస్తే సొంత పార్టీ వాళ్లు అని కూడా చూడకుండా వారితో న్యాయ పోరాటం చేసి ఆ స్థలాలు తుడాకు స్వాధీనం చేసి ప్లాట్లుతో తుడాకు ఆదాయం వచ్చేలా చేశామని ఆయన చెప్పారు.

తుమ్మలగుంట చెరువు అభివృద్ధి తప్పా

మంత్రి నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడైన హరిక్రిష్ణ వీసీగా పనిచేయడం వల్ల ఎక్కడా నిబంధనలు అతిక్రమించలేదని, తుడా పాలనలో అధికారాలన్నీ ఆయనకే ఉంటాయన్నారు. తుమ్మలగుంట చెరువు అభివృద్ధి చేయడం తప్పే అయితే చంద్ర బాబు ఆదేశాలతో అవిలాల చెరువుకు టీటీడీ రూ.70 కోట్లు ఖర్చు చేయడం కూడా తప్పే అవుతుందని చెవిరెడ్డి తెలిపారు. చంద్రబాబు గోదావరి పుష్కరాల సమయంలో చోడవరం నియోజకవర్గ పరిధిలో సిమెంటు బెంచీలు తయారు చేయించి ఒక్కో బెంచీకి రూ.15,750 చెల్లించారని, ఐదేళ్ల తరువాత అదే క్వాలిటీతో అదే కొలతలతో అదే కాంట్రాక్టర్ చేత ఒక బెంచీ రూ.8 వేలుకు తయారు చేయించామన్నారు. ఇందులో ఏది ఎక్కువ..? ఎక్కడ అవినీతి జరిగిందో పెద్దలు ఆలోచించాలని సూచించారు. తుడా పరిధి రెండు నియోజకవర్గాల నుంచి రెండు జిల్లాలకు విస్తరించినప్పుడు ఉద్యోగులు, వారి జీతాలు, రవాణా వంటి ఖర్చులు పెరుగుతాయన్న విచక్షణ కూడా తెలియడం లేదన్నారు. తుడాకు టీటీడీ బోర్డులో స్థానం కలిగినప్పుడు తిరుపతి పర్యటనకు వచ్చే ప్రముఖుల ప్రొటోకాల్‌కు వాహనాలను పెట్టినమాట వాస్తవమేనని చెవిరెడ్డి స్పష్టం చేశారు.

అవును.. చంద్రగిరికే ఎక్కువ పెట్టాను..

చంద్రగిరికి తుడా నిధులు అధికంగా ఖర్చు పెట్టారని చెబుతున్నారు.. అవును నిజమే.. ఎక్కువ గానే పెట్టాను.. ఏ దేశానికి రాజైనా తల్లికి బిడ్డ అన్న చందంగా రాజకీయాల్లో తాను ఏ స్థాయికి ఎదిగినా తల్లివంటి చంద్రగిరికి తాను బిడ్డనేనని, అందుకే అధికంగా ఖర్చు చేసి అభివృద్ధి చేశానని చెవిరెడ్డి వివరించారు. ఇప్పుడు జరిగే విజిలెన్స్ విచారణలో కూడా నిస్పక్షపాతంగా నివేదిక తయారు చేస్తే తాము చేసిన అభివృద్ధి పడిన కష్టం ప్రజలకు తెలుస్తుందన్నారు. ఏ తప్పు జరగకున్నా తప్పు జరిగినట్లు నివేదిక ఇస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదని చెవిరెడ్డి స్పష్టం చేశారు.

పెళ్లింట విషాదం

- కూతురి పెళ్లి పనులకు వెళ్లి తండ్రి హఠాన్మరణం



సాంబయ్య(ఫైల్)



సాంబయ్య కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఎస్ఐ నరేష్

కేవీబీపురం: మరికొద్ది రోజుల్లో జరగాల్సిన పెళ్లి ఇంట విషాదం అలుముకుంది. కూతురి పెళ్లి పనుల్లో నిమగ్నమైన తండ్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన కేవీబీపురం మండలం కోవనూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోవనూరు గ్రామానికి చెందిన సాంబయ్య(43) తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తన పెద్ద కుమార్తెకు శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌కు చెందిన వ్యక్తితో ఈనెల 8వతేదీన వివాహం నిశ్చయించుకున్నారు. ఈ తరుణంలో సాంబయ్య విధులకు లీవు పెట్టి పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం శ్రీకాళహస్తిలో షాపింగ్ ముగించుకుని ఇంటికి తిరుగు వెళుతుండగా సాంబయ్య గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సాంబయ్య మృతితో కోవనూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కేవీబీపురం ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా సాంబయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం సాంబయ్య అంత్యక్రియలను అధికార లాంఛనాలతో పూర్తి చేశారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

రేణిగుంట : హైదరాబాద్ నుంచి అరుణాచలానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చందు (19) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, శివ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా.. హైదరాబాదు నుంచి ద్విచక్ర వాహనంపై అరుణాచలం వెళుతుండగా మార్గం మధ్యలో రేణిగుంట సమీపంలోని యోగానంద కాలేజ్ ఫ్లైఓవర్ పైన శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన చందు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో స్థానిక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. గాజుల మండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ గూండాగిరి



టీడీపీ గూండాల చేతిలో గాయపడ్డ శంకర్, గ్రామంలో మాటు వేసిన టీడీపీ గూండాలు, నాయకులు

- గ్రామ కంఠం, చెరువు పొరంబోకు స్థలం ఆక్రమణకు యత్నం
- సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు
- భయం గుప్పెట్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు

పాకాల : దారి విషయమై వైఎస్సార్‌సీపీ వర్గీయులను టీడీపీ నాయకులు చితకబాదిన సంఘటన శుక్రవారం పాకాల మండలంలోని మద్దినాయనపల్లి పంచాయతీ ఐయ్యావారిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు స్వర్ణలత, సుబ్బమ్మ, రాణి తెలిపిన వివరాల మేరకు.. తమ ఇంటికి ఆనుకుని గ్రామకంఠం, చెరువు పొరంబోకు స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్న టీడీపీ నాయకులను అడ్డుకోవడంతో తమపై దాడికి దిగారని ఆరోపించారు. అధికారం చేతిలో ఉందిని, పక్క గ్రామాల నుంచి టీడీపీ చెందిన రౌడీలను, నాయకులను పిలిపించి దాడులకు పాల్పడ్డారని ఆవేదన చెందారు. ఆడవారని కూడా చూడకుండా జాకెట్లను సైతం చింపేసారని వాపోయారు. ఇదే దారి విషయమై నెల క్రితం కూడా టీడీపీకి చెందిన గూండాలు దౌర్జన్యం చేసారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు వివరించారు. అయితే బాధితుల వైపు నిలవాల్సిన ఎస్ఐ అధికార పార్టీ గూండాలు, నాయకుల కొమ్ము కాస్తూ భాదితులైన తమని బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ ఈ విషయంపై చొరవ చూపాలని కన్నీటి పర్యంతమయ్యారు. రెవెన్యూ అధికారులు కూడా టీడీపీ గూండాలకే మద్దతు తెలుపుతూ వారికి అనుకూలంగా పత్రాలను సృష్టించి పేదలకు అన్యాయం చేస్తున్నారని బాధకు లోనయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాడికి పాల్పడ్డ టీడీపీ గూండాలపై కేసు నమోదు చేసి కఠిన శిక్ష విధించాలని బాధితులు వాపోయారు. గొడవకు చెందిన సంఘటనను వీడియో తీస్తున్న శంకర్‌పై దాడికి దిగి రక్త గాయాలు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

లాసెట్ ప్రవేశ పరీక్ష కీ విడుదల

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన 3, 5 ఏళ్ల లా కోర్సు, పీజీ లా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్–2025 పరీక్షకు సంబంధించి ప్రాథమిక కీని శుక్రవారం విడుదల చేశారు. అభ్యర్థులు ప్రాథమిక కీ కోసం ఉన్నత విద్యామండి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. జవాబు కీపై 8వతేదీలోపు అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం ఇచ్చారు. అభ్యంతరాల సమీక్ష అనంతరం 16న ఫైనల్ కీ విడుదల చేసి 22వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు.

కంటైనర్‌లో మంటలు

తడ : తడ పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం థర్మాకోల్ షీట్లతో వెళుతున్న కంటైనర్‌లో మంటలు చెలరేగాయి. శ్రీకాళహస్తి వైపు నుంచి చెన్నై వెళుతున్న లారీ జాతీయ రహదారిలోని తడ పోలీసు స్టేషన్ వద్దకు రాగానే ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడడంతో నెల్లూరు వైపు వెళ్లే వాహనాలు రహదారిపై నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ



గొలుసు పోగొట్టుకున్న వృద్ధురాలు

తిరుపతి రూరల్, (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం చల్లావారి పల్లెకు చెందిన కాంతమ్మ (70) శుక్రవారం పొలం వద్ద గడ్డికోసుకుని వస్తుండగా వెనుకనే వచ్చిన ఓ వ్యక్తి వృద్ధురాలి మెడలోని బంగారం గొలుసును లాక్కొని వెళ్లాడు. దీంతో వృద్ధురాలు వారిని పట్టుకోలేక గట్టిగా కేకలు పెట్టినప్పటికీ అక్కడ అందుబాటులో ఎవ్వరు లేరు. అనంతరం రామచంద్రాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీమ్డ్ యూనివర్శిటీగా ఆదిశంకర



మాట్లాడుతున్న ఆదిశంకర అధినేత వంకి పెంచలయ్య

నెల్లూరు (టౌన్): ఆదిశంకర గ్రూపు ఆప్ ఇన్‌స్టిట్యూట్‌కు డీమ్డ్ యూనివర్శిటీగా కేంద్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించిందని ఆ విద్యాసంస్థల గ్రూపు చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని మినర్వా గ్రాండ్‌లో డీమ్డ్ యూనివర్శిటీ లోగోను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జోన్‌లో డీమ్డ్ యూనివర్శిటీగా గుర్తింపు పొందింది కేవలం ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల మాత్రమేనని చెప్పారు. 2001లో కేవలం 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఇంజినీరింగ్ కళాశాల నేడు 8వేల మంది విద్యార్థులతో ఉందన్నారు. కోవూరు సమీపంలోని రామన్నపాలెం వద్ద కొత్తగా ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలను 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మధ్వాచార్య, ప్రొఫెసర్లు వేణుమాధవ్, ధనుంజయ, ఏటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి.. ఆ స్నేహమానందగీతం!

- వివాహ వేడుకల్లో చిన్ననాటి స్నేహితుల అపూర్వ కలయిక
- తలుపు తట్టిన మధురజ్ఞాపకాలు
- భావోద్వేగానికి గురైన మాజీ మంత్రి ఆర్కే రోజా



వివాహ వేడుకలో చిన్ననాటి స్నేహితులతో మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : చిన్ననాటి స్నేహితులందరూ తమ స్నేహితురాలి కుమారుని పెళ్లిలో కలుసుకున్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజా స్నేహితురాలు శంకరమ్మ కుమారుడు చంద్రారెడ్డి, మోక్షితకు శుక్రవారం ఉదయం అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎస్‌వీఎస్ఎస్ కల్యాణ మండపంలో వివాహమైంది. గురువారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా, భాకరాపేట పాఠశాలలో 10వ తరగతి వరకు కలసి చదువుకున్న వారంతా ఆ వివాహ వేడుకలకు హాజరయ్యారు. వీరిలో కొందరు ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. వారిలో ఒకరైన రోజా సినీ రంగంలోను, రాజకీయ రంగంలోనూ రాణిస్తున్నారు. ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా స్నేహమాధుర్యం మళ్లీ వారిని బడి ఈడు పిల్లలుగా మార్చేసింది. ఆ నాటి స్నేహం ఆనంద గీతమై ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. బాధలు తెలియని నవ్వులు, మౌనం తెలియని మాటలు, కల్మషమెరుగని ప్రేమలు, కష్టం ఎరుగని క్షణాలతో గడిపిన రోజులను తలచుకొని చిన్న పిల్లలైపోయారు. చదువులమ్మ బడిలో చేసిన అల్లరిని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మనసులో మరపురాని బాల్యపు పుటలను తిరగవేశారు. అందులో నిండిన ఆనంద క్షణాలను ఆస్వాధించారు. బడిస్నేహం వారిని కొత్త బంగారు లోకానికి తీసుకెళ్లింది. చిన్ననాటి కథలు మధుర జ్ఞాపకాల తలుపులను తెరిచాయి. ఇకపై అందరూ టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు మళ్లీ కలుసుకున్న తీపి క్షణాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఫొటోలు తీసుకుని భద్రపరుచుకున్నారు. స్నేహితులకు తమ పిల్లలను, కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలిసి ఆనందాలు పంచుకోవడం మరువలేని క్షణాలని, తాను ఎంతో భావేద్వాగానికి గురయ్యానని ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు.

తిరుపతి లడ్డూ పేరు, ఫొటోతో పుష్ మై కార్ట్

తిరుమల: శ్రీవారి లడ్డూపేరు, ఫొటోతో 'పుష్ మై కార్ట్' అనే ఈ కామర్స్ సంస్థతోపాటు మరో నాలుగు సంస్థలు వ్యాపారం నిర్వహిస్తుండడంపై టీటీడీ నోటీసులు జారీచేసింది. పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదానికి పేటెంట్ హక్కును 1999 లోనే జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ చట్టం కింద టీటీడీ పొందింది. ఈ నేపథ్యంలో పవిత్రమైన ప్రసాదాన్ని వ్యాపారానికి ఉపయోగించుకోవడంపై టీటీడీ చర్యలు చేపట్టింది. సదరు సంస్థ తిరుపతి లడ్డూ పేరు, ఫొటోలను ఉపయోగించుకుని ఉత్పత్తులను విక్రయిస్తోంది. దీంతోపాటు మరో నాలుగు సంస్థలు ఇటువంటి వ్యాపారాలు నిర్వహిస్తుండడంపై టీటీడీ ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసింది. శ్రీవారి లడ్డూ పేరుతో విక్రయిస్తున్న ఉత్పత్తులను వెంటనే తొలగించాలని ఆయా సంస్థలకు నోటీసులో పేర్కొంది.

రాత్రి పూట కౌన్సెలింగ్

- 273 మంది ఎస్టీటీ ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్
- రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ
- అవస్థల్లో ఉపాధ్యాయులు



ఉద్యోగోన్నతుల ప్రక్రియకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ పరిశీలన.. రాత్రి 7 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియ శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన టీచర్లు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఇష్టానుసారంగా బదిలీ ఉత్తర్వులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఈ ఉత్తర్వుల్లో అవకతవకలు, ఇష్టానుసారంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. క్యాన్సర్, గుండె, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కుంటున్న టీచర్లు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. సంబంధిత సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కుంటున్న టీచర్లకు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో మినహాయింపు కల్పించాల్సి ఉంటుంది. వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ప్రాంతాలకు బదిలీలు చేయాల్సి ఉంటుంది. అయితే చాలా మంది టీచర్లకు శ్రీకాళహస్తి నుంచి మదనపల్లికి, నాగలాపురం నుంచి పెద్దమండ్యం, శ్రీకాళహస్తి నుంచి చౌడేపల్లి ఇలా దూరప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ విషయం పై బాధితులు చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారుల వద్దకు వచ్చి సంప్రదిస్తుంటే తమకు ఎలాంటి సంబంధం లేదంటూ చేతులెత్తేశారు.

273 మందికి ఉద్యోగోన్నతులు

జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, నగర పాలక యాజమాన్యాల్లో పనిచేస్తున్న టీచర్లకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి, ఏడీలు వెంకటేశ్వరరావు, సుకుమార్ పర్యవేక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 273 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు శుక్రవారం రాత్రి మొత్తం కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగోన్నతులు కల్పించే ప్రక్రియను చేపట్టారు.